నర్సపూర్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరటానికి సిద్ధంగా వుంది.

హడావుడిపడుతూ చేతిలో పేపరుతో కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చాడు రఘుపతి. తన బెర్తుపైనున్న ముసలాయన్ని "చూసి"ఇది నా బెర్తండీ" అని అన్నాడు.

"ఏదో పెద్దవాణ్నిగదా, పై బెర్తు యిచ్చారు నాకు. కాస్త ఎవరు సర్దుకున్నా సరే నాయనా, నేను ఎక్కలేనాయె పైకి" అంటూ ఎదుటి బెర్త్‌వాళ్ళని, పక్కవాళ్ళని చూస్తూ అడిగాడు.

"సర్లెండి తాతగారూ. మీరు ఈ పక్కగా పడుకోండి. నాకు నిద్ర వచ్చే వేళకి పైకి వెడతానులెండి" అని కూచుని పేపరు విప్పాడు రఘుపతి.

"ప్రశ్నా పత్రాలు వెల్లడి" అంటూ బిగ్గరగా చదివాడు రఘుపతి.



# గౌరవం

ఎన్.దుర్గాప్రసూనాంబ

"ఏమిటో! ఏం పరీక్షలో, ఏం చదువులో. ఓచోట ప్రశ్న పత్రాల వెల్లడి అంటారు, మరోచోట కాపీ అంటారు. ఇంటర్వ్యూలో అవకతవక జవాబులని వేస్తుంటారు. రోజులిలా వున్నాయి" అంటూ ఓ ప్రయాణీకుడు అన్నాడు.

"ఇప్పుడు చదువులా? మా రోజుల్లో మేస్టర్లలాంటి వాళ్ళెక్కడండీ ఇప్పుడు!" అన్నాడు రఘుపతి.

"ఆ రోజులా? ఆ గురువులే వేరు. అప్పటి వాళ్ళకి గురువులంటే వుండే భయం ఇప్పుడెక్కడ వుంది? అసలు వాళ్ళకున్న సబ్జక్టు నాలెడ్జి ఇప్పటి మేస్టర్లలో వుందా అని?" మరొకరి వ్యాఖ్య.

రఘుపతి నవ్వుతూ మొదలు పెట్టాడు. "నా చిన్నప్పటి సంఘటన ఒకటి గుర్తుకొస్తోంది. మా కాలేజిలో శేషాచార్యులుగారని కామర్స్ లెక్చరర్ వుండే వారు. ఆయనంటే కాలేజి అందరికీ హడలే."

మధ్యలో అడ్డుపుల్ల వేశారు తాతగారు- "ఎవరండీ ఆయన" అంటూ మఫ్లర్ సవరించుకుంటూ లేచి కూచున్నారు.

"శేషాచార్యులుగారని గుంటూరు కాలేజిలో వుండే వారు. ఆయన ఇన్విజిలేషన్‌కు వస్తున్నారంటే అందరికీ హడలే. మేము కోడ్ లాంగ్వేజిలో 'పాము పాము' అని 'శేషశైలవాసా' అని అంటుండేవాళ్ళం. ఆయన తన దగ్గర ట్యూషన్ చదివేవాడు కాపీ కొడ్తుంటే రఫీమని పట్టుకున్నాడు. పైగా యింకో విశేషమేమిటంటే ఆ పిల్లవాడి తండ్రి లాయరు. ఆ లాయరు దగ్గర శేషాచార్యులుగారి దావా ఒకటి వుంది. అది గెలిస్తే లాయరుగారికి పది ఎకరాల పొలం వస్తుందట. ఏమైనా మొహమాటపడి వదిలేశాడనుకున్నారా? చక్కగా రిపోర్టిచ్చి డిబార్ చేయించాడు!"

"స్టూడెంట్సు వూరుకున్నారయ్యా మరి" అని ప్రశ్నించారు తాతగారు.

'తాతగారికి కూడ వుత్సాహం కల్గించిందే ఈ విషయం!'అనుకుంటూ "ఊరుకోవటమా! అందరం కట్టకట్టుకుని ఆ లాయరుగారి దగ్గరకు వెళ్ళి 'మీ అబ్బాయిని యిలా చేసినందుకు ఆయన కేసు ఓడిపోయేలా చేయండి' అని గట్టిగా అడిగాం. ఆయన అలాగే అని ఓ సంవత్సరం అయింతర్వాత కేసు గెలిపించారు. మాకు ఈ విషయం తెలిసి అదేమని అడిగితే 'మీ మాష్టారు పక్షపాత రహితంగా బాధ్యత నిర్వర్తించారు. మరి పేరున్న లాయరుగా నేనూ పక్షపాత రహితంగా ఆయన కేసు న్యాయంగా గెలిపించి నా విధిని నేను నిర్వర్తించాను. ఇక మీ విద్యార్థులే మీ విధి అయిన విద్యార్జన చెయ్యక, శ్రద్ధగా చదువుకోక అక్రమ మార్గాలు పట్టి మీరు చేసిందే న్యాయమని అనుకుంటున్నారు. శ్రద్ధగా చదివితే కాపీ కొట్టవలసిన ఖర్మ ఎందుకు వస్తుంది? చేసిన తప్పుడు పని బట్టబయలయిందని సిగ్గుపడక మాష్టారు గారికి అన్యాయం నా ద్వారా చేయించాలని చూశారు. మీరున్న ఆవేశంలో అలాగేనని నేను అనకపోతే మరో రకంగా మాష్టరుగార్ని ఏం చేస్తారోనని సరే అన్నానుగాని నా బాధ్యత, విధి విస్మరించలేదు. ఇకనైనా వంకర మార్గాలు మాని శ్రద్ధగా చదువుకోండి' అని మందలించి పంపారు."

"మీకు మీ పాము మాష్టారంటే అసహ్యం, కోపం లేవూ యిప్పుడు?" అన్నారు తాతగారు.

"ఇప్పుడు మా ఫ్రెండ్ అంటాడు, 'ఆయన అలా పట్టుకోబట్టే సంతం కొద్దీ చదివి సబ్జక్టు నేర్చుకున్నాను. పైకి వచ్చి మంచి ఉద్యోగం చేసుకుంటున్నాను' అని."

"బాగుందయ్యా బాబూ. ఎంత కథ చెప్పావు. మొత్తానికి ఆవేళ తిట్టే నా జీవితంలో ఆయనపై గౌరవం పెంచుకున్న ఆ విద్యార్థి నిజమైన విద్యార్థి" అన్నారు తాతగారు.

"అసలు అంతేనండి. విద్యార్థులకు భయపడి కాపీ పట్టుకోకపోతే ఎలాగండీ? అప్పుడు కోపం వచ్చినా తరువాత గురువుగారిపై గౌరవం ఏర్పడటానికి. నిజానికి మా పాము మేష్టారంటే నాకు గౌరవమూ, భక్తీ యిప్పటికీ!" అన్నాడు రఘుపతి.

అందరూ నిద్రలోకి జారుకున్నారు మెల్లిగా. తెల్లవారుతుండగా సికింద్రాబాద్ స్టేషన్ వచ్చేసింది. తాతగారు మఫ్లరు సవరించుకుంటూ "నాయనా రఘుపతీ కాస్త సంచి అందిస్తావూ!" అంటూ లేచి నిలబడ్డారు.

ఆ చనువుకి ఆశ్చర్యపడుతూ, అయినా పెద్దవారు గదా అనుకుని "పదండి మెల్లిగా, నే పట్టుకొస్తా" అని తన బాగ్, ఆయన బాగ్ పట్టుకుని దిగి ప్లాట్‌ఫాం మీద నిలబడ్డాడు.

"థాంక్స్ రఘుపతీ! నన్ను గుర్తుపట్టలేదు నువ్వు. నిన్ను నేను గుర్తుపట్టా, నీ మెడమీద పుట్టుమచ్చను బట్టే" అంటూ మఫ్లర్ తీసేసారు తాతగారు.

తేరిపార చూస్తున్నాడు రఘుపతి. నామాలుండే చోట ఆనవాళ్ళున్నాయి.

"మీరు...మీరు అయితే..."

"అవునయ్యా మీ పాము మాష్టార్నే. బంధువుల యింటికి వెడుతున్నా. ఇవాళ పదో రోజు! అందుకే నామం పెట్టుకోలేదు. నువ్వు గుర్తుపట్టలేదు. నువ్వు నీ కథేగా చెప్పింది" అంటూ బోసినోటితో నవ్వారు.

తేరుకుని,"మీవల్లే పైకొచ్చాను మాష్టారూ! సి.ఎ. కూడా చేశాను. బొంబాయిలో ఉద్యోగం. చాల సంతోషం మాష్టారూ! మీ ప్రస్తుత అడ్రసు యివ్వండి. అక్కడ కొస్తా సాయంత్రం" అంటూ రెండు చేతులు జోడించాడు రఘుపతి భక్తితో, గౌరవంతో.